# సెలబ్రేషన్!

విజయవాడ విడిచి నలభైయేళ్లయింది ! ఇంత కాలానికి మళ్లీ రావలసిన వచ్చింది. రైలు దిగగానే స్టేషన్ ఎంతో మారిపోయినట్టన్పించింది. కొత్త పెళ్లికూతురులా వుందిప్పుడు. ఒకప్పుడు నెత్తురులేక పాలిపోయిన పేషెంట్‌లా వుండే విజయవాడకు కళాకాంతులొచ్చి కళకళలాడునూండటం గమనించాను.

బైటికి రాగానే చీమల బారుల్లా రిక్షలగుపించేవి ! ఇప్పుడు అన్నీ ఆటోలు కళ్లబడినయ్.

'బస్టాండ్‌కు వెల్లాలి... ఎంత?' ఆటోవాలాని అడిగాను..

'కొత్త బస్టాండా?... పాత బస్టాండా సార్' ఎదురుప్రశ్న వేశాడు.

'ఎన్ని బస్టాండ్లు వున్నయ్?'

'చాలా వున్నయ్ సార్...'

'అదికాదయ్యా !... బకింహాం కాలవ పక్కనే పొడవుగా బస్సులతో క్రిక్కిరిసి వుండేదే... ఆ బస్టాండు !'

'అక్కడ్నించి బస్టాండెప్పుడో మారిపోయింది సార్.'

'సరే కొత్త బస్టాండుకెంత తీసుకుంటావ్?-'

'యాభై రూపాయలవుతుంది'

'అంతవుతుందా...సరే మీటర్ వెయ్...'

'ఈరోజుల్లో మీటర్లు పన్చెయ్యవు సార్. షేర్ ఆటో అయితే ఒకరేటు... సింగిల్ పాసింజరైతే మరో రేటు...'

'పదిహేను ఇస్తాను వస్తావా?'

తలపొగరుతో బదులివ్వలేదు.

ఇంతలో లక్కీగా రిక్షా అవుపించడంతో కేకేసి పదిరూపాయలకు బేరమాడి ఎక్కేను. ఆటోకి సమర్పించే దానికి బదులు శ్రమపడే రిక్షావాడికి ఓ అయిదు ఎక్కువ ఇచ్చినా నష్టం లేదన్పించింది.

పావుగంటలో కొత్త బస్టాండు చేరుకుంది రిక్షా ! పదిహేను రిక్షావాడికివ్వగానే

విశ్వాసంతో కూడిన కృతజ్ఞతా భావంతో ముఖం కలువపూవులా వికసించటం గమనించాను.

బుకింగ్ కౌంటర్ చేరుకుని 'క్యూ' లో నిలబడి తెనాలి బస్‌కు టిక్కెట్టు తీసుకుని వెళ్లి ప్లాట్‌ఫామ్ మీదున్న బస్సులో కూర్చుండిపోయాను.

అది నాన్‌స్టాప్ బస్ కావటంతో కండక్టర్ వుండడని తెల్సింది. బస్సు బయల్దేరటానికి ఇంకా టైముంది కాబోలన్పించి క్యాంటీన్‌కెళ్లి టిఫిన్ చేసి కాఫీ తాగి రావచ్చనుకుంటూండగ... ఓ ఇరవైయ్యేళ్ల కుర్రాడు బస్సులోకొచ్చి ప్యాసింజర్లందరికీ ఏవో కరపత్రాలిచ్చి దీనంగ ముఖం పెట్టి నమస్కరించటం చూశాను.

అతను నన్నూ సమీపించి నాకూ ఓ కరపత్రాన్ని చేతిలో పెట్టాడు. అది ఒకవైపు తెలుగులో మరొకవైపు ఇంగ్లీషులో వుంది.

నేను అనాధను ! మూగవాడిని ! భిక్షటనే జీవనాధారం... తల్లులారా... తండ్రులారా నేను మీ బిడ్డలాంటి వాడిని. ఎవరికి తోచినంత సాయం వారు చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను...

కరపత్రంలోగల సారాంశాన్ని చదివేక నాకు ఆశ్చర్యం వేసింది. ఇలాంటి బెగ్గర్‌ను ఎక్కడా లోగడ చూసిందిలేదు. ఇదేదో వెరైటీగా వున్నదన్పించింది.

అతగాడి మీద జాలికలగలేదు. కష్టపడవలసిన వయసులో అడుక్కోవటమేమిటన్పించింది?. అడుక్కోవటం వాడికి ఏమాత్రం సిగ్గన్పించటంలేదు. రిక్షా తొక్కొచ్చు... మట్టి తట్టలు మొయ్యొచ్చు... తోపుడు బండ్ల మీద తిరుగుతూ కూరగాయలు పళ్లు పూలు అమ్మి గౌరవంగ బ్రతకచ్చు.

కష్టపడి జీవించటానికి వళ్లు వంగదు వెధవలకు అనేసి తిట్టుకున్నాను. అర్ధ రూపాయి ఇచ్చిన వారందరికీ నమస్కరించి తానిచ్చిన కాగితాన్ని వెనక్కు తీసేసుకుంటున్నాడు.

నాదాకా వచ్చాక ఇవ్వనంటూ నేను తల అడ్డంగ ఆడించాను. నాగడ్డం చేత్తో పుచ్చుకుని దీనాతి దీనంగ ముఖం పట్టాడు లొంగలేదు. వంగి కాళ్లు పట్టుకున్నాడు. వాడావిధంగ కాళ్లా వేళ్లా పడటం చిరాకన్పించింది.

కష్టపడకుండా ఆదాయం వచ్చే మార్గం బెగ్గింగే ! దొంగతనాలు చేయ

మనస్కరించదు. పట్టుబడితే లాఠీ దెబ్బలు జైలుశిక్ష... చిప్పకూడు ! అయినా దీనికే ప్రిఫరెన్స్ ఇస్తున్నారనేకులు !

ఆమధ్య ఓ రాజకీయపార్టీ... బెగ్గర్స్‌క్కూడా ప్రభుత్వమే జీవనోపాధి కల్పించాల్సిన బాధ్యత వుందని... అలాచేయని పక్షంలో వయోపరిమితిని పట్టి పింఛన్ సదుపాయం కల్పించాలనీ... దేశవ్యాప్తంగ ఉద్యమించింది. బెగ్గర్స్ దొంగలుగా మారకుండా వుండాలంటే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలనేది ఆ పార్టీ వాదన !.

ఆ విషయం గర్తొచ్చి నవ్వుకున్నాను.

బస్సుదిగి మూగవాడు వెళ్లిపోయాడు. నేనూ టిఫిన్ ,ఏసి కాఫీ తాగిరావటానికి బస్‌లోంచి దిగి ఫ్లాట్‌ఫామ్ మీద నాలుగడుగులు ముందుకు నడిచాను.

ఇంతలో అక్కడున్న పాన్‌షాప్ వద్ద నిలబడి కింగ్‌సైజు ఫిల్టర్ సిగరెట్ కొని తాగటం కా కంలపడింది. అక్కడున్న వారితో ఏదో హస్క్ కొడుతున్నాడు. నివ్వెరపోయాను. అంటే... అతగాడు మూగవాడు కాదన్నమాట ! అందరినీ ఛీట్‌చేసి వచ్చిన బడ్బుతో జల్సా చేస్తున్నాడన్నమాట.

నన్ను చూచి గుర్తుపట్టి ఎటో పారిపోయాడు. ఇలాంటి వెధవలను పోలీసులకు అప్పగించాలి.

నా వూహ నిజమైంది ! వాడు అడుక్కుంటున్నప్పుడే నాకు డౌటొచ్చింది. పైగా ఐ హేట్ బెగ్గింగ్ !

మన దేశ జనాభాలో ఒకవంతు ఆడ మగ అడుక్కునేవాళ్లే వున్నారు.

బస్ హారన్ మోత విన్పించగానే వెనుదిరిగి వెళ్లి తెనాలి బస్సెక్కాను.

బస్సు కదిలాక నా పక్క పాసింజర్ 'ఈరోజు బెగ్గర్స్ డే సార్ ! దేశవ్యాసప్తంగ ఆనందోత్సాహలతో వేడుక జరుపుకుంటున్నారు ముష్టివాళ్లు' అనటంతో అవాక్కయ్యాను.

వాళ్ల సెలబ్రేషన్‌కు నిజంగ హేట్సాఫ్ !!

--- సమాప్తం ---